**అరుణ**

ఎర్రపూడల అగ్రహారం అని ఒక వూరు. ఆవూరుచుట్టూ చిన్న చిన్న గ్రామాలు చాలా ఉన్నాయి. ఆగ్రామాలన్నిటిలో వసతులూ లేకుండా ఉన్నది ఎర్రపూడల అగ్రహారం ఒక్కటే.

ఆ గ్రామంలో వినాయకుడనే బీదవాడు ఒకడుఉన్నాడు. వినాయకుడికి ఒక్కడేకొడుకు. వినాయకుడు ప్రతిరోజూ చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్ళి పూతరేకులు అమ్ముకొని జీవించేవాడు.

ఒకరోజు మామూలు ప్రకారం పూతరేకుల అమ్మకానికని వినాయకుడు, బయలుదేరి వెళ్లాడు. కాని, ఆరోజున అసలు బోణీయే కాలేదు. ఆఖరికి బియ్యం కొనుక్కునేందుకు సరిపడే సొమ్ముకూడా చేరలేదు.

ఒట్టిచేతుల్తో ఇంటికి తిరిగివచ్చిన భర్తనుచూసి "పెద్దవాళ్ళమయిన మనమంటే పస్తుంటాం కుర్రకుంక వాడిగతి ఏంకాను?" అని కంట తడిపెట్టింది భార్య. ఏం చెబుతాడు పాపం వినాయకుడు? - ఎన్ని గ్రామాలు తిరిగినా తనకు శ్రమ తప్ప ఇంకేమీ మిగలలేదు. తన దురదృష్టాన్ని తలచుకొని చింతించాడు.

మరునాడు కూడా పూతరేకుల బుట్ట నెత్తిన పెట్టుకొని బయలుదేరాడు వినాయకుడు. తిన్నగా ప్రక్క గ్రామానికి చేరుకొన్నాడు ఊరిమధ్యకు రాగానే అక్కడ పోగై ఉన్న జనాన్ని చూచి "పూతరేకులు, పూతరేకులు వేడివేడి పూతరేకులు- నోట్లోవేసుకోగానే వెన్నలా కరిగిపోతాయి, చౌక, చక్కని పూతరేకులు" అంటూ ముందుకు సాగాడు. ఇంతలో ఆ గుంపులోంచి నడికారు వయస్సులోనున్న ఒక పెద్ద యివతలకువచ్చి - "ఏమయ్యా, ఏవూరునుంచి వస్తున్నావు? తిన్నగా ఎర్రపూడల అగ్రహారం నుంచేవస్తున్నావా? లేక, ఇదుగో ఈప్రక్కగానున్న గ్రామం మీదుగా వస్తున్నావా" అని నిలేసి అడిగేడు.

అలా ఆయన అడగటానికి కారణమేమిటో అర్థం కాలేదు వినాయకుడికి. ఆశ్చర్యంగా చూస్తూ వెంటనే సమాధానం చెప్పలేక పోయినాడు. "బాబూ! ఒక్కోరోజున నేను తిన్నగా యిక్కడికే వస్తుంటాను. ఒక్కో సమయంలో మాత్రం ఆ గ్రామంలో అమ్ముకోగా మిగిలిన సరుకుతో యిక్కడికి వస్తుంటాను ఇవ్వాళ మాత్రం తిన్నగా యిక్కడికే వచ్చాను." అన్నాడు బిక్కమొహంతో. గుంపులో ఉన్న ఒక యువకుడు పెద్దగొంతుతో "ఇదుగో —ఇప్పుడే చెబుతున్నాను, ఈసారి వైష్ణవుల భూమిలోక్కి మళ్ళీమా గడ్డ మీద అడుగుపెట్టావంటే ఏంజరుగుతుందో చూసుకో......' అంటూ హెచ్చరించాడు. అమాయకుడైన వినాయకుడికి అతనలా అనటానికి గల కారణం బోధపడలేదు. సరే లెండి... అంటూ తిన్నగా వచ్చిన దారినే యింటికి బయలుదేరాడు.

ఆనాడుకూడా ఒట్టి చేతుల్తో వచ్చిన భర్తను చూచి భార్య ఆశ్చర్యపోయింది. ఇక భర్తవల్ల సంసారం గడవటం దుర్లభమనే నిశ్చయానికి వచ్చింది వినాయకుడి భార్య. మర్నాడు కొడుకునిపిలిచి- "నాయనా భద్రయ్యా, మీనాన్న ఒక్కరివలన మన సంసారం గడవటం కష్టంగాఉంది. నువ్వూ వయసొచ్చిన వాడవు గనుక ఏదో ఒక గ్రామానికి వెళ్ళి పూతరేకులు అమ్ముకువస్తే కాస్తఇబ్బంది తప్పుతుంది" అని చెప్పింది.

ఈ సంగతి తెలిసి వినాయకుడు కొడుకుని చేరబిలిచి 'ఒరేయ్ భద్రయ్యా! నేను నాలుగు గ్రామాలూ తిరిగి అమ్మలేక కాదు ఇప్పుడు ఒకగ్రామానికీ, మరో గ్రామానికీ, కక్షలు పెరిగి, తిట్టుకుంటూ ఉన్నారు. ఆ కోపం నామీదచూపి నాదగ్గర సరుకుకొనటం మానివేశారు. అందుకే యీ మధ్య మనసరుకు అసలు అమ్ముడు పోకపోవటం. అంతేగాని, మీ అమ్మ అనుకొన్నట్లు నేను బద్ధకించటం



★ ఉపాయం ★

వల్లకాదు' అని జరిగినదంతా చెప్పాడు. తండ్రి మాటలను పూర్తిగా విన్నాడు భద్రయ్య.

వెంటనే తల్లి దగ్గరకు వెళ్లి పూత రేకులు తయారు చేయమని చెప్పి, తాను రెండు అట్టముక్కలు తీసుకుని జాగ్రత్తగా కత్తిరించాడు. వాటిమీద తెల్లకాగితం అంటించాడు. ఒకదానిమీద "వీర భద్రయ్య పూత రేకుల దుకాణం" అనీ, మరో దానిమీద రామ భద్రయ్య పూత రేకుల దుకాణం అని వ్రాశాడు. ఆ రెండింటిని మెడలో వేలాడ వేసుకొందుకు వీలుగా తాళ్లు కట్టి సిద్ధ పరుచుకున్నాడు.

తెల్లవారుతూండగానే భద్రయ్య లేచి, కాలకృత్యాలు తీర్చుకొని పూత రేకుల బుట్ట నెత్తిన పెట్టుకొని, మెడలో, "రామ భద్రయ్య పూత రేకుల దుకాణం" అని వ్రాసిఉన్న అట్ట వేసుకొని వైష్ణవుల గ్రామానికి బయలుదేరి వెళ్లాడు. గ్రామం మధ్యకు వెళ్లగానే పెద్దా చిన్నా అంతా చుట్టుముట్టారు. అందరూ అతనివంక ఆశ్చర్యంగా చూశారు. భద్రయ్యకు గుండెదడ హెచ్చిపోయింది —వీళ్లంతా కలిసి ఏమి చేస్తారో అని భయపడినా ధైర్యవంతుడు కాబట్టి గుండె దిట్టచేసుకొని చూస్తూనిలబడ్డాడు.

ఇంతలో ఆ గుంపులోనుంచి ఒకపెద్ద బయటికివచ్చి "నిన్నటి వరకూ మనగ్రామంలో పూత రేకులు అమ్మటానికి వచ్చినవాడు మనల్ని చాలా మోసగించి, ఇక్కడి మాటలన్నీ అక్కడ చెబుతూండే వాడు. అందుకే వాడివద్ద మనం అందరం పూత రేకులు కొనటం మానివేశాం. ఈరోజున మన వైష్ణవుడే పూత రేకులు అమ్మటానికి వచ్చాడు. మనం అందరం కలిసి సాటి వైష్ణవుడయిన ఈ రామ భద్రయ్యను ప్రోత్సహించాలంటే, ఇతని దగ్గరతప్ప మరొకరి దగ్గర పూత రేకులు కొనకూడదు." అని ఉపన్యాస ధోరణిలో చెప్పాడు.

తమ పెద్ద చెప్పాడు గదా అని ఊళ్ళోవాళ్ళంతా వెంటనే భద్రయ్య తెచ్చిన పూత రేకులన్నీ కొనేశారు.

ఇదివరలో వారంరోజులు కష్ట పడినా ఒక్కబుట్టెడు పూత రేకులు అమ్మటం బ్రహ్మప్రళయంగా ఉండేది వినాయకుడికి. అటువంటిది యీనాడు కొడుకు ఒక్కపూటలో బుట్టెడు పూత రేకులు అమ్ముకు రావడంతో వినాయకుడి కళ్లు ఆనందంతో చెమ్మగిల్లాయి.

మర్నాడు కూడా అమ్మకానికి మరోబుట్టెడు పూత రేకులు సిద్ధం చేసింది భద్రయ్య తల్లి. భద్రయ్య ఈసారి "వీరభద్రయ్య పూత రేకుల దుకాణం" అని వ్రాసివున్న అట్టను మెడలో వేసుకొని, శైవులు ఎక్కువగా ఉన్న గ్రామానికి బయలు దేరాడు.

గ్రామంలో అడుగు పెట్టగానే ఒక్కొక్కరొక్కరుగా నెమ్మదిగా ఊళ్లో జనంఅంతా చిన్నా పెద్దా భద్రయ్య చుట్టూమూగి వింతగా

చూట్టం మొదలుపెట్టారు. ఒక పెద్ద తన చేతిలోని పొన్ను కర్రను వయ్యారంగా వూపుతూ తిన్నగా భద్రయ్య దగ్గరకువచ్చి అతని మెడలోని అట్టనుచూసి "వీరభద్రయ్య పూతరేకుల దుకాణం" అని చదువుకొని తనలో నవ్వుకున్నాడు.

తన ప్రక్కనే ఉన్నవారిని అందరినీ కూర్చోబెట్టి యిలా చెప్పడం మొదలుపెట్టాడు.

"మీతో ఒక విషయం, చాలా ముఖ్యమైన విషయం చెబుతున్నాను, శ్రద్ధగా వినండి, మొన్నటిదాకా మనఊళ్లో పూతరేకులు అమ్మినవాడు ఎవరనుకున్నారు? మనపక్క గ్రామంలోని వైష్ణవులు మన గ్రామంలో గుట్టుమట్లు అన్నీ కూపీతియడానికి పంపినవాడు. అంతేకాని మరోడు కాడు. అందుకనే పెద్దలందరమూ చేరి వాడ్ని మళ్ళీ ఇక్కడకు రాకుండా చేశాము ఈరోజున, యిక్కడ వున్న ఈ వీరభద్రయ్య, మన శైవుడు. అందుచేత, మీరందరూ వీరభద్రయ్యను అభిమానించాలి. రేపటినుంచి మనందరకు కావలసిన పూతరేకులను మనమతస్థుడు అయిన ఈ వీరభద్రయ్యే సప్లయి చేస్తుంటాడు. అందరూ ఇతనిదగ్గరే కొంటూ" ఉండాలని నామనవి... అంటూ కొన్ని పూతరేకులు కొనుక్కొని పోయాడా పెద్దమనిషి.

భద్రయ్య పూతరేకుల బుట్ట చూస్తూ వుండగానే ఖాళీఅయిపోయింది. భద్రయ్య, ఖాళీబుట్టను ఊపుకుంటూ అమితానందంతో యింటికి చేరుకున్నాడు. ★

# ఎవరిదీ సూట్ కేసు?

వి. ఎస్. చెనహ్యారి

మేనల్లుడి కూతురి పెళ్ళిగ్గాను మద్రాసు వెళ్లిన పేర్రాజుగారు పెళ్ళిపూర్తయిన తరువాత ఓరోజు, అలా ఊరిమీదికి బయలుదేరారు. తిరిగితిరిగి మూర్ మార్కెట్టు చేరుకున్నారు పాతసామాన్లు అమ్మే దుకాణాల వద్ద కొచ్చేసరికి ఓ పాత సూట్ కేసు ఆయన కంటబడింది. పేర్రాజుగారు తన కసమడికి అల్లాంటి సూట్ కేసొకటి కొనాలని చాలా రోజులుగా అనుకొంటూ ఉన్నారు కాని ఎప్పుడూ వీలుచిక్కింది కాదు. ఇది 'సెకెండ్ హాండ్' ది కాబట్టి చవుకగానే దొరకవచ్చు. అందుచేత యెలాగయినా కొనేయాలని నిశ్చయించుకున్నారు. బేరంచేసి చివరికి ఐదురూపాయలకి కొనేశారు.

మరునటిరోజు రాత్రిభోజనానంతరం, పైపంచా, పాతకోటూ, పెళ్ళింటివారు కట్టిచ్చిన ఫలహారాలూ, కొబ్బరికాయా అన్నీ సూట్ కేసులో అమర్చి, మూతపెట్టి, తాళంవేసి, తాళం భద్రంగా బొడ్లోదోపుకుని, పెళ్లింటివారివద్ద సెలవు పుచ్చుకుని ఆయన ఊరికి ప్రయాణమయ్యారు. సెంట్రల్ స్టేషన్ చేరుకుని, టిక్కెట్టు కొనుక్కుని విశాఖపట్నం ప్యాసింజెర్లో యెక్కి, సూట్ కేసుని తన కెదురుగుండా సామాన్లు పెట్టుకునే బెర్తుమీద ఓ చివర పెట్టుకూర్చున్నారు. బండి కదిలే సమయానికి పెట్టెలో రద్దీ యెక్కువయింది.

బేసిన్ బ్రిడ్జిలో కాబోలు, జనాన్నితోసుకుని యిద్దరు వ్యక్తులు లోపలికి జొరబడ్డారు. అందులో ఒకరు బుష్ కోటు వేసుకున్నారు. ఆ ఆసామీ చేతిలో ఓసూట్ కేసు ఉంది. అది అచ్చం పేర్రాజుగారి సూట్ కేసు లాంటిదే కాని, కొత్తది! విద్యుద్దీప కాంతిలో తళతళా మెరిసిపోతున్నది. ఆసూట్ కేసు పేర్రాజుగారి సూట్ కేసు మీద పెట్టి, కూచునేందుకు చోటులేకపోవటంచేత వారిద్దరు అలాగేనుంచున్నారు. బండి కదిలింది.

"ఎంత బావుంది! — కనీసం, పాతికరూపాయలు పెట్టందే అలాంటిది రాదు"— అని అనుకుంటూ, ఆ కొత్త సూట్ కేసువేపే చూస్తూ ఉండిపోయారు పేర్రాజుగారు. పక్కస్టేషనులో కొందరు దిగిపొయ్యారు కొందరు ఎక్కారు. ఆ ఎక్కినవాళ్ళలో ఓఆసామీబండెడు లగేజీ పట్టుకొచ్చాడు. బెర్తుమీద లగేజీసర్దడంలో యీసూట్ కేసులు రెండూ క్రిందుమీదయినై. ఇది ఒక్క పేర్రాజుగారు తప్ప మరెవ్వరూ గుర్తించలేదు.

ఆ కొత్త సూట్ కేసు పట్టుకొచ్చినవ్యక్తులు అలా నుంచోలేక, యెక్కడేనా చోటుందేమో చూచిరావడానికాబోలు పొన్నేరిస్టేష